సాక్షి
వికారాబాద్
శుక్రవారం ׀ 16 ׀ ఆగస్టు ׀ 2024



నిర్మించారు.. వదిలేశారు..

దుద్యాల్ జెడ్పీహెచ్ఎస్‌లో రూ.3.5లక్షలతో నిర్మించిన కిచెన్‌షెడ్ ప్రారంభానికి నోచుకోవడం లేదు. 9లో ▸

న్యూస్‌రీల్

శివయ్యకు మువ్వన్నెల ముస్తాబు



తాండూరు: పట్టణంలోని భావిగి భద్రేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని శివాలయంలో స్వామివారిని గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా అలంకరించారు. శివలింగం ముందు భాగం, వెనక జాతీయ జెండా, భరతమాత పోస్టర్‌ను ఉంచారు. ఆలయ అర్చకుడు విజయ్‌కుమార్ త్రివర్ణ రంగులతో స్వామివారిని అలంకరించి పూజలు చేసి దేశభక్తిని చాటుకున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

భారీగా ట్రాఫిక్ జామ్



నిలిచిపోయిన వాహనాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రైల్వే బ్రిడ్జిపై మధ్యాహ్నం ఆటోను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలోని వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. బ్రిడ్జి చిన్నగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు అరగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డుగా ఉన్న ఆటో, కారును తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

'డబుల్' ఇళ్లకు సదుపాయాలు

టెండర్లు ఆహ్వానించిన జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వివిధ కాలనీల్లో లబ్ధిదారులకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో సదుపాయాలు కల్పించకపోవడంతో వారు వాటిలో ఉండటంలేదు. గత సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలోనూ కొన్ని ప్రాంతాల ప్రజలు సదుపాయాల లేమిపై ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణ సమయంలోనే తాగునీరు, శానిటరీ, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించినప్పటికీ, చాలా కాలం వరకు లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించనందున కొన్ని ప్రాంతాల్లో పైపులు, విద్యుత్ తీగలు, శానిటరీ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిని మరమ్మతులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల నుంచి వెల్లువెత్తుతున్న ఫిర్యాదులతో తిరిగి వాటిని సమకూర్చేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ప్రస్తుతం శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో కొత్తవి ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. టెండర్లు పూర్తి చేసి పరికరాలు సమకూర్చుకొని అమర్చనుంది.

గోడలు తొలగించాలి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

తుర్కయంజాల్: లింక్ రోడ్లకు అడ్డుగా ఉన్న ప్రహరీ గోడలను తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్ నుంచి సమీప కాలనీలకు ఉన్నటువంటి లింక్ రోడ్లకు అడ్డంగా ఉన్న గోడలను తొలగించాలని గురువారం శివాజీనగర్, అన్నపూర్ణ కాలనీవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్ రజింత్ హోమ్స్‌లో తరచూ రోడ్డును మూసివేయడం, అక్కడ గుంతలు తీయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే స్పందించి లింక్‌రోడ్లను తొలగించాలన్నారు. సుమారు 10 కాలనీల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని విన్నవించారు. దీనికి చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. భాస్కర్‌రెడ్డి, యాదగిరి, శంకర్‌రెడ్డి, తులసీరాం, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



అనంతగిరి: ఆయుధాన్ని పరిశీలిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఘనంగా.. తిరంగా

జిల్లా వ్యాప్తంగా గురువారం పంద్రాగస్టు వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రజాప్రతినిధుల ఆఫీసుల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకున్నారు. యువత వారి బాటలో నడవాలని వక్తలు పిలుపునిచ్చారు. విద్యార్థుల దేశభక్తి పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు.

– అనంతగిరి



జెడ్పీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



తాండూరు మున్సిపల్ కార్యాలయం వద్ద వంద అడుగుల ఎత్తులో జాతీయ పతాకం



అనంతగిరి: విద్యార్థుల విన్యాసం



జాతీయ జెండాలతో విద్యార్థినుల ప్రదర్శన

అభివృద్ధి సంక్షేమమే ఎజెండా

- అన్ని వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- రుణమాఫీతో రైతులకు పండుగ
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- కలెక్టరేట్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

వికారాబాద్: అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన సాగుతోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో కోటి 54లక్షల మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు. 2,836 మంది పేదలు రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు పొందారని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ గృహాలు నిర్మించనున్నట్లు వివరించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తోందన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,19,735 మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు వినియోగదారులకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు జీరో బిల్లులు జారీ చేయడం జరిగిందని, 1,25,721 కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు.

మాఫీతో పండుగ వాతావరణం

ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేసి రాష్ట్ర ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. దీంతో రైతులు పండుగ చేసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో 1,09,269 మంది రైతులకు రూ.905 కోట్ల రూపాయల పంట రుణాలు మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత సీజన్‌లో 5లక్షల 98వేల ఎకరాలు సాగుకు అంచనా వేయగా ఇప్పటి వరకు 4లక్షల 43 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారని వివరించారు. జిల్లాకు 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటి వరకు 30,320 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని, మరో 15,663 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 5,829మంది రైతులు మరణించగా వారి కుటుంబాలకు రూ.291.45 కోట్లు అందజేశామని చెప్పారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహం

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు ప్రోత్సహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ తెలిపారు. 2024 – 25 సంవత్సరంలో 2వేల ఎకరాల్లో ఆయిల్



కలెక్టరేట్ వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

పామ్ తోటలు సాగు చేయడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు వివరించారు. ఇప్పటివరకు 162మంది రైతులు 603 ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటినట్లు తెలిపారు. మరో వెయ్యి ఎకరాల్లో పంట సాగు చేసే అవకాశం ఉందన్నారు. ఉద్యాన అభివృద్ధి మిషన్ కింద ఈ ఏడాది 830 ఎకరాల్లో రూ.2.40 కోట్ల వ్యయంతో పండ్ల తోటలు, కూరగాయలు, పూల తోటలు పెంచేందుకు ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. 1,062 అమ్మ ఆదర్శ పాఠశాలలకు గాను 924 స్కూళ్లలో పనులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. 202 స్కూళ్లలో పనులు పూర్తయ్యాయని, మిగిలిన చోట పురోగతిలో ఉన్నాయన్నారు. జిల్లాలో స్త్రీ నిధి బ్యాంక్ ద్వారా 63 గ్రామాల్లోని 216 సంఘాలకు రూ.5.57కోట్ల రుణం ఇవ్వడం జరిగిందన్నారు. పొదుపు సంఘాలకు బ్యాంక్ లింకేజీతో ఇప్పటివరకు 1,447 సంఘాలకు రూ.13.869 లక్షల రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో ఉందన్నారు.

అనంతగిరి పర్యాటక అభివృద్ధికి రూ.110 కోట్లు

అనంతగిరి కొండలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.110 కోటు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా కోట్‌పల్లి ప్రాజెక్టు, సర్పన్‌పల్లి బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొడంగల్‌లో వివిధ అభివృద్ధి పనులకు రూ.996.36 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వికారాబాద్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు యువకులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. పలువురు పంచాయతీ కార్యదర్శులకు రెగ్యులర్ ఆర్డర్లు ఇచ్చారు. సెర్ప్, మెప్మాకు సంబంధించిన బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కులను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు రివార్డులు అందజేశారు. అనంతరం ఆయా శాఖల తరపున ఏర్పాటు చేసి స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఎస్పీ నారాయణరెడ్డి, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తగా 15 సబ్‌స్టేషన్లు

జిల్లాలో 2024–25 సంవత్సరంలో 15 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో 1,189 చెరువులు ఉండగా 78 వేల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు.కోట్‌పల్లి ప్రాజెక్టును స్థిరీకరించి 9,200 ఎకరాలకు సాగునీరు అందించడం కోసం ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.ఉద్దండాపూర్ ఎడమ కాలువను రూ.1,470 కోట్లతో బాగు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 746 చెరువుల్లో కోటి 29లక్షల చేప పిల్లలు వదలనున్నట్లు తెలిపారు. జిల్లాలో టీజీఐపాస్ కింద 45.57 కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించి 550 పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చడం జరిగిందన్నారు.

కాంగ్రెస్ మాటిస్తే శాసనమే



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి మూడో విడత రుణమాఫీ అమలు

పరిగి: కాంగ్రెస్ అంటేనే రైతు ప్రభుత్వం. పార్టీ మాట ఇస్తే అది శాసనమేనని ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. మూడో విడత రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని గురువారం గడిసింగాపూర్ రైతు వేదికలో కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం పంట రుణాలను మాఫీ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, అయినా సీఎం రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం, రాష్ట్ర ప్రయోజనాల కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. తాము మూడు విడతలో జిల్లా వ్యాప్తంగా రూ.905 కోట్ల పంట రుణాలను మాఫీ చేశామని తెలిపారు. పథకం అమలు కాని రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం దశల వారీగా నెరవేస్తుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్లు, రుణమాఫీ చేసి మాట నిలుపుకొన్నామని తెలిపారు.

రైల్వే లైన్ తెస్తా..

పరిగి నియోజకవర్గానికి సాగునీరు, రైల్వే లైన్ తేవడమే నా ఏకైక లక్ష్యమని, వాటిని సాధించి తీరుతానని ఎమ్మెల్యే అన్నారు. ఇప్పటికే రూ.2,500 కోట్లతో నేవీ రాడార్ సేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన పనులను త్వరలోనే సీఎం రేవంత్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రైల్వే లైన్ కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ఇటీవల సీఎం, రైల్వే శాఖ ఉన్నతాధికారులు పనులపై సమీక్ష నిర్వహించారన్నారు. కేపీ లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నియోజకవర్గానికి దాదాపు రూ.15 వేల కోట్లు తెచ్చామని గుర్తు చేశారు. త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. దేశంలోని ప్రతి ఒక్కరికి తిండి పెట్టేది రైతులేనని వారికి ఎంత చేసినా తక్కువే అవుతుందన్నారు. రుణమాఫీ కాని రైతులు అధికారులను సంప్రదించాలని సూచించారు. మాఫీ అయిన వారు బ్యాంకుల్లో మళ్లీ పంట రుణాలు తీసుకోవాలన్నారు. బ్యాంకర్లు ఇబ్బంది పెడితే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం గ్రామంలోని ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా వ్యవసాయధికారి గోపాల్, డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు ఆంజనేయులు, విజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జవాన్ల సేవలు మరువలేనివి



ఆర్మీ మాజీ జవాన్లు, రైతులను సన్మానించిన చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: దేశ రక్షణలో జవాన్లు, అన్నం పెట్టే రైతుల సేవలు మరువలేనివని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట్ గ్రామంలోని అటల్ బిహారీ వాజ్‌పేయ్ హరిబాబు నర్సరీలో గురు వారం రిటైర్ అయిన ఆర్మీ జవాన్లు, రైతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను లెక్కచేయకుండా సరిహద్దుల్లో సేవలందిస్తున్న జవాన్లకు అభినందనలు తెలిపారు. దేశ రక్షణకు పాటుపడుతున్న జవాన్లు, పంటలు పండించి తిండి పెడుతున్న రైతన్నలు దేశానికి ముఖ్యమన్నారు. నాయకులు, కార్యకర్తలు కేంద్రంలో ప్రధాని మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. అంతకు ముందు జాతీయ జెండాను ఆవిష్కరించి, రిటైర్ అయిన జవాన్లు, రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్ యాదవ్ పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందించే సహకారం మరువలేనిదని అంతారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామారావు అన్నారు. మండలంలోని అంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాల్గొన్న గ్రామ నాయకులు పాఠశాల అభివృద్ధికి తమవంతు సాయంగా విరాళాలు అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, రిటైర్డు ఉపాధ్యాయుడు ఆర్.అంజయ్యగౌడ్ లక్ష రూపాయల విరాళం అందజేశాడని చెప్పారు. అదేవిధంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎస్.అంజన్‌గౌడ్ పాఠశాల క్లీనింగ్, పోడియం అభివృద్ధికి సహకరిస్తానని చెప్పగా గ్రామానికి చెందిన మరో నాయకుడు కావలి వెంకటేశ్‌బాబు పాఠశాలకు విద్యావలంటరీ ఏర్పాటుకు సహకరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామానికి చెందిన ఆవుల శ్రావణ్‌కుమార్ విద్యార్థులకు షూ, సాక్స్‌లు అందించారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు దాతలను ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివకుమార్, బుచ్చిబాబు, రోజ్‌మేరి, విజయకుమారి, ఉమాదేవి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ మానేమ్మ, మాజీ చైర్మన్ మాణిక్యం, నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

గ్రామాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి దాత సామ రంగారెడ్డి గురువారం లక్ష రూపాయల విరాళం అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ సామ మానిక్యరెడ్డి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు గొల్లపల్లి, ధర్మసాగర్ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నందుకు దాతలను గ్రామస్తులందరూ కలిసి ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

ధారూరు: మండలంలోని అల్లిపూర్ శివారులో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. గ్రామ శివారులోని చెట్టు కింద పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి మండల కేంద్రానికి చెందిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7,840 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్య


లక్ష్మి (ఫైల్)

దౌల్తాబాద్: కడుపు నొప్పి భరించలేక అంగన్‌వాడీ టీచర్ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దేవర్‌ఫసల్‌వాద్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దేవర్‌ఫసల్వాద్ గ్రామానికి చెందిన లక్ష్మి (35) భాగ్యతండాలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. కొంత కాలంగా కడుపు నొప్పి వస్తుండేది. బుధవారం కడుపు నొప్పి భరించలేక లక్ష్మి పురుగు మందు తాగింది. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కొడంగల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చెల్లెలు తార ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవిగౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


రామయ్య (ఫైల్)

పూడూరు: వ్యక్తి అదృశ్యమైన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మిట్టకంకల్ గ్రామానికి చెందిన భేరి రామయ్య(50)బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆయన కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే చన్గోముల్ ఠాణా నంబర్ 87126 70042కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

ముస్తాబు చేస్తుండగా.. విద్యుత్ షాక్

కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి

యాలాల: స్వాతంత్ర్య వేడుకలకు ముస్తాబు చేస్తుండగా ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన బషీర్‌మియాతండా శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. స్వాతంత్ర్య సంబరాల్లో భాగంగా తాండూరు నుంచి హైదరాబాద్ ప్రధాన మార్గంలో విద్యుత్ దీపాల అలంకరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రధాన దారిలో విద్యుత్ పనులు చేపడుతుండగా హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టు ఉద్యోగి షారుఖ్(27) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో నగరానికి రిఫర్ చేశారు. మార్గమధ్యలోమృతి చెందడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై గురువారం సాయంత్రం వరకు ఫిర్యాదు అందలేదని యాలాల ఎస్ఐ శంకర్ తెలిపారు.

విధి నిర్వహణలో నిజాయితీ అవసరం

– వీజీ అకాడమీ డైరెక్టర్ సతీష్‌కుమార్

మీర్‌పేట: తమ ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు విధి నిర్వహణలో నిజాయితీ అలవర్చుకోవాలని వీజీ అకాడమీ డైరెక్టర్ వి.సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) గెజిటెడ్ పరీక్షలో ఇనిస్టిట్యూట్ విద్యార్థులు విజయం సాధించిన సందర్భంగా గురువారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ రాఘవేంద్రనగర్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. గెజిటెడ్ స్థాయి అనేది ఎంతో బాధ్యత కలిగిన పదవి అని, గ్రీన్‌పెన్‌తో పెట్టే ప్రతీ సంతకం ఆ బాధ్యతను గుర్తుచేయాలని సూచించారు.

జెండా రోజు మద్యం విక్రయాలు

శంకర్‌పల్లి: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన గురువారం మోకిల ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండకల్ గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న నర్సింహారెడ్డి స్వాతంత్ర్య దినోత్సవం రోజు మద్యం విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ పోలీసులు దాడులు జరిపారు. అతని వద్ద సుమారు రూ.50 వేల విలువ గల 25 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మోకిల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించి, కేసు నమోదు చేయించారు.


అనంతగిరి: ప్రశంసాపత్రాలు అందుకుంటున్న జిల్లా అధికారులు చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

అధికారుల సేవకు పట్టం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారాలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో గురువారం ఉదయం జాతీయ పతాకావిష్కరణ చేశారు. సందర్భంగా జిల్లాలో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జెడ్పీ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం జిల్లాలో పాలనా పరంగా ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

–సాక్షి, నెట్‌వర్క్


దుద్యాల్: ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకుంటున్న సత్యనారాయణ


కొడంగల్: ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్ విజయ్‌కుమార్


దోమ: ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రికార్డు అసిస్టెంట్ మోహన్


తాండూరు: ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎంసీహెచ్ ఆర్ఎంఓ అనిల్‌రెడ్డి


బొంరాస్‌పేట: అవార్డు అందుకుంటున్న మెట్లకుంట ఏఈఓ భార్గవి


బంట్వారం: అవార్డుతో ఏపీఎం శివయ్య


బంట్వారం: టీఏ అశోక్‌రెడ్డి


కుల్కచర్ల: ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అంతారం ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి

చిత్రలేఖనంలో చిన్నారి ప్రతిభ

కుల్కచర్ల: రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు విద్యాశాఖ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో భాగంగా చౌడాపూర్ మండలం మరికల్ జెడ్పీ పాఠశాలకు చెందిన అభిజ్ఞ(8వ తరగతి) జిల్లాలో ప్రతిభ కనబరిచారు. గురువారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరుల చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.


అభిజ్ఞను అభినందిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్


అనంతగిరి: ప్రశంసా పత్రాలు అందుకుంటున్న జిల్లా పోలీసు అధికారులు

రెపరెపలాడిన జాతీయ పతాకం

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

అనంతగిరి: జిల్లా కేంద్రంలో గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, ప్రధాన చౌరస్తాల్లో, ఆయా సంఘాలు, ఆయా పార్టీల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీ కార్యాలయంపై ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జాతీయ జెండాను ఆవిష్కరించగా, వికారాబాద్ కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీ కార్యాలయంపై ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్డీఓ కార్యాలయం ముందు ఆర్డీఓ వాసుచంద్ర జాతీయ పతాకాన్ని ఎగరవేశారు.


కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

ఉపాధి భవనంపై ఎగరని జెండా


జెండా వందనం చేయని ఉపాధిహామీ భవనం

సిబ్బందిపై ఎంపీడీఓ ఆగ్రహం

దోమ: మండల కేంద్రంలోని స్త్రీశక్తి, ఉపాధిహామీ భవనంపై అధికారులు జాతీయ జెండాను ఎగరవేయలేదు. మండల పరిషత్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించగా.. ఇక్కడ మరిచారు. దీంతో అధికారులపై స్థానికులు, జాతీయవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై ఎంపీడీఓను వివరణ కోరగా ఉపాధిహామీ భవనం తమ పరిధిలోకే వస్తుందని, అందుకే ఎగరవేయలేకపోయామని సమాధానం ఇచ్చారు.

పల్లె దవాఖానలో..

మండలంలోని ఆరు పల్లె దవాఖానలలో సైతం జెండా ఎగరవేయలేదు. ప్రతీ పల్లె దవాఖానలో ప్రస్తుతం ఏఎన్ఎం, ఆశ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై స్థానికులు ఏఎన్ఎంలను ప్రశ్నిస్తే తమకు ఎలాంటి ఆదేశాలు లేవని, అందుకే ఆవిష్కరించలేదన్నారు. మండల వైద్యాధికారి రజితను వివరణ కోరగా.. పల్లె దవాఖానలలో జెండా ఎగరవేయలేదని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీనిపై ఏఎన్ఎంలను నిలదీయగా గతంలో పల్లె దవాఖానలో డాక్టర్ల సమక్షంలో జెండా ఎగరవేసేవారని, డాక్టర్లు లేని కారణంగా తాము నిర్వహించలేదని బదులిచ్చారు.

రైతు వేదికపై ఎగరని జెండా

పరిగి: ఒక పక్క స్వాతంత్ర్య వేడుకలు, మరో ప్రభుత్వం పక్క రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తూ రైతు వేదికల్లో సంబరాలు చేసుకోవాలని ఆదేశాలు ఇస్తోంది. కానీ మండలంలోని రాపోల్ రైతు వేదికలో కనీసం జాతీయ జెండా ఎగరవేయని దుస్థితి నెలకొంది. దీనిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాగో రైతులకు అందుబాటులో ఉండకున్న పర్వలేదు కానీ కనీసం స్వాతంత్ర్య దినోత్సవం రోజైన జెండా ఎగరవేయరా.. వ్యవసాయ అధికారుల తీరుపై మండి పడుతున్నారు.

అదనపు కట్నం.. అతివకు శాపం

పహాడీషరీఫ్: ఎక్సైజ్ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకోవడం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివాదాస్పదంగా మారింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన నిఖిల్ సోదరి బరిగెల మౌనికను ఎక్సైజ్ కానిస్టేబులైన శ్రీకాంత్‌గౌడ్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశారు. అప్పుడు రూ.40 లక్షల వరకు కట్నం చెల్లించారు. వీరికి ఒక కుమారుడు జన్మించినప్పటికీ.. భార్యాభర్తల నడుమ గొడవలు కొనసాగుతూ వస్తున్నాయి. అత్తింటి వారు అదనంగా రూ.25 లక్షలు కట్నం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన మౌనిక బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గురువారం ఈ విషయమై ఇరు కుటుంబాలతో పాటు రాజకీయ నాయకులు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ వద్ద భారీగా గుమిగూడారు. పోలీసులు అందరిని సముదాయించి బయటికి పంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

జెండావిష్కరణలో అపశ్రుతి

శంకర్‌పల్లి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని 2వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి వార్డు కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో జాతీయ జెండాని ఎగరవేశారు. అయితే ఉప కేంద్రం వద్ద జెండా ఆవిష్కరణలో అపశ్రుతి చోటుచేసుకుంది. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కౌన్సిలర్ తలకిందులుగా ఉన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సరిచేసి జెండాను ఎగరవేశారు.

మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన గురువారం మండలంలోని ఇంద్రారెడ్డి నగర్‌లో చోటుచేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రారెడ్డినగర్ చౌరస్తా సమీపంలో సైకిల్ ట్రాక్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు బుధవారం అర్ధరాత్రి సమాచారం చేర వేశారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడారు.

పెట్రోల్‌లో నీళ్లు!

ఆందోళనకు దిగిన వాహనదారులు

షాద్‌నగర్ రూరల్: పెట్రోల్‌లో నీళ్ల కలిపారని వాహనదారులు ఆందోళనకు దిగిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బుచ్చిగూడ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి... ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామానికి చెందిన శివ తన పల్సర్ బైక్‌లో రూ.300 పెట్రోల్ పోయించుకొని గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బైక్ ఆగిపోయింది. బైక్‌ను స్టార్ట్ చేసుకొని కొద్ది దూరం వెళ్లగానే మళ్లీ ఆగిపోయింది. ఎంత ప్రయత్నించినా స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్‌ను పిలిపించాడు. పెట్రోల్ ట్యాంకును విప్పి అందులోని పెట్రోల్‌ను బాటిల్‌లో నింపి చూశారు. అందులో నీళ్ల ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో సాయంత్రం బంకు వద్దకు చేరుకొని నిర్వాహకులను నిలదీశారు. అటుగా వెళ్తున్నా వాహనదారులతో కలిసి ఆందోళనకు దిగారు. లక్షలు వెచ్చించి కొన్న వాహనాల్లో కల్తీ పెట్రోల్ పోయడంతో అవి పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి రిపేర్లకోసం రూ. వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మూడు నెలల క్రితం ఇదే పెట్రోల్ బంకులో కల్తీ పెట్రోల్ ఘటన వెలుగు చూసిందని వినియోగదారులు మండిపడ్డారు. పెట్రోల్ బంకుల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు కల్తీ పెట్రోల్‌ను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.


కల్తీ పెట్రోల్‌ను చూపుతున్న వాహనదారుడు

కందుకూరు వాసికి పురస్కారం

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లుగుప్తాకు ఉత్తమ సేవా పురస్కారం

కందుకూరు: ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాకు జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆయన గత 25 ఏళ్లుగా రంగారెడ్డితో పాటు పలు జిల్లాల్లో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లుగుప్తా మాట్లాడుతూ.. పురస్కారం లభించడం తనపై బాధ్యతను మరింత పెంచినట్లయిందన్నారు. తనను అవార్డుకు ఎంపిక చేసినందుకు నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ ప్రెసిడెంట్ కృష్ణకుమార్, కోశాధికారి సత్యనారాయణ, ఎండీ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లుగుప్తా

రోడ్డు ప్రమాదంపై కేసు

తలకొండపల్లి: అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన ఆయిల్ సైదులు గురువారం రామాసిపల్లి మైసమ్మ ఆలయం వద్ద కల్లు అమ్ముకుంటున్నాడు. కల్లు దుకాణం పక్కన తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్ సైకిల్‌ను ఉంచాడు. ఇంతలోనే మిడ్జిల్ నుంచి కారు అతి వేగంగా దూసుకు వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. కారులో జడ్చర్ల మండలం మురుగుపల్లి పెద్ద తండాకు చెందిన కేతావత్ రమేశ్‌గా పోలీసులు గుర్తించారు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.